క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



పెద్దకొత్తపల్లి: మరికల్ గ్రామానికి చెందిన జయమ్మ 17,500, లచ్చగౌడ్ 52,500ల సీఎం సహాయనిధి చెక్కులను గురువారం బాధితులకు మాజీ ఎంపీటీసీ దండు నరసింహ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్ రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రానికి చెందిన రమేష్ అనారోగ్యం వల్ల సీఎం రిలీఫ్‌ఫండ్‌కోసం దరఖాస్తు చేసుకోగా, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సహకారంతో గురువారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటయ్య బాధితుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంక నారాయణ, సంద మల్లయ్య, శేఖర్, బుచ్చయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి, వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయా దేవస్థానాల చైర్మన్‌లు కల్వ మనోహర్, జూలూరి రమేష్‌బాబు చెప్పారు. వేంకటేశ్వరస్వామి దేవాలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలకు హాజరు కానున్నట్లు మనోహర్, గణేష్‌బాబులు చెప్పారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కల్వకుర్తి టౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కల్వకుర్తి ఎంవీఐ అశోక్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని డిపోలో ఆర్టీసీ సిబ్బందితో కలిసి రోడ్డు భద్రతా వారోత్సవాలలో డీఎం సుభాషిణితో కలిసి పాల్గొన్నారు. బస్సును నడిపే సమయంలో కొద్ది జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని డ్రైవర్లకు సూచించారు. అనంతరం రోడ్డు భద్రతపై డ్రైవర్లతో ఎంవీఐ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపోలోని డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అపార్ నంబరు జనరేషన్



తాడూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అపార్ నంబర్ జనరేషన్ కార్యక్రమం మండలంలోని శిర్సవాడ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. రాబోయే కాలంలో డిజిటలైజేషన్‌లో భాగంగా అపార్ ఎంతో అవసరమని, అపార్ అవశ్యకత పూర్తి వివరాలను ఆయన తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

పాలబిల్లులు ఇప్పించండి

కల్వకుర్తిరూరల్: రెండు నెలలుగా పాల బిల్లులు రావడం లేదని వెంటనే పాలబిల్లులు వచ్చేలా చూడాలని పాడి రైతులు గురువారం కల్వకుర్తిలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. పాడిరైతు శేఖర్‌రెడ్డి ఆయనతో మాట్లాడారు. 15 రోజులకు ఒక సారి వచ్చే బిల్లు 60 రోజులైనా రావడం లేదని, దీంతో తమకు సమస్యలు వస్తున్నాయని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పాడి రైతులు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపు తనిఖీ

తిమ్మాజిపేట: మండల కేంద్రం తిమ్మాజిపేటలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాక్ వివరాలను ఎఫెల్‌వీఈఎస్‌ఆప్ ద్వారా పరిశీలించారు. కానీ సదరు దుకాణంలో ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు ఏవీ లేకపోవడం విశేషం. కొన్ని దుకాణాలలో మాత్రం ఏఓ, ఏఈఓలు తనిఖీ నామమాత్రంగా చేస్తున్నట్లు మిగతా దుకాణదారులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ రాజశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. గురువారం లింగాల నుంచి నాగర్‌కర్నూల్‌కు ద్విచక్ర వాహనంపై డ్యూటీకి వెళ్తుండగా, తెలకపల్లి గ్రామ శివారులో లింగాల–తెలకపల్లి రోడ్డుపై మరో ద్విచక్ర వాహనంపై నాగరాజు అతి వేగంతో వచ్చి రాజశేఖర్ వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రాజశేఖర్‌కు కుడి కాలుకు, కుడి చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. రాజశేఖర్ తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత బస్సుతో మహిళలకు లబ్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



అచ్చంపేటలో ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం అచ్చంపేట ఆర్టీదసీ డిపో వద్ద రెండు నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసీ మరింత బలోపేతమైందన్నారు. అచ్చంపేట డిపోకు ఇప్పటివరకు 10 బస్సులు రావడం జరిగిందని, మరో 10 బస్సుల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. నూత న బస్సులు ఇచ్చినందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీదుర్గాప్రసాద్, ఆర్టీసీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం

శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ఈనెల 16 నుంచి 22 వరకు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలకు రావాలని గురువారం ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లికి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న మంత్రి ఆలయానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. గతంలోనూ ఉమామహేశ్వర ఆలయానికి మంత్రి నిధులు మంజూరు చేశారని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

ఉమామహేశ్వరంలో కార్పొరేషన్ చైర్మన్ పూజలు

శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, శివుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ చరిత్రగూర్చి ఈఓ శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వీరయ్య శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ.1.44 లక్షలు రికవరీ



ప్రజావేదికలో వివరాలను వెల్లడిస్తున్న తనిఖీ సిబ్బంది అధికారులు

తెలకపల్లి: మండల కేంద్రంలో శ్రీశక్తి భవనం వద్ద ఉపాధిహామీ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ 14వ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ఈజీఎస్ సిబ్బంది నుంచి సేకరించిన వివరాలు చదివి వినిపించారు. 1 ఏప్రిల్ 2023 నుంచి మార్చి 31, 2024 వరకు రూ.అరున్నర కోట్ల ఉపాధిహామీ పనులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజావేదికలో వినిపించారు. దాస్‌పల్లి, జంగమొనిపల్లి, కమ్మరెడ్డిపల్లి, వట్టిపల్లి గ్రామాలలో ఎలాంటి అక్రమాలు జరగలేదని అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి తెలిపారు. మండలం మొత్తం రికవరీ రూ.1,11,259లక్షలు, జరిమానా రూ.33వేలు, మొత్తం రూ.1,44,259 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు డీఆర్‌డీఓ తెలిపారు. ఈ ప్రజావేదిక సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రామ్‌లాల్, ఏపీడీ చంద్రశేఖర్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ నసిరుద్దీన్, జంగయ్య, రాఘవేందర్ రెడ్డి, ఏపీఓ మల్లేష్, రామస్వామి, మల్లేష్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఫాతిమాషేక్ కృషి ఎనలేనిది



ఫాతిమాషేక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌ఎల్‌సీ కిరణ్మయి, పాఠశాల ఉపాధ్యాయులు

కల్వకుర్తి/కొల్లాపూర్: మహిళల విద్యావికాస అభ్యున్నతితో పాటు వారి కోసం విద్యాసంస్థలు నడిపిన మొదటి ముస్లిం మహిళ ఫాతిమాషేక్ కృషి ఎనలేనిదని మైనార్టీ గురుకులాల ఆర్‌ఎల్‌సీ కిరణ్మయి అన్నారు. గురువారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల కో–ఆర్డినేటర్ రూపారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫాతిమా షేక్ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలేతో కలిసి స్త్రీ విద్య కోసం షేక్‌ఫాతిమా ఎంతో కృషి చేశారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ఐ నియోజకవర్గ అధ్యక్షులు గణేష్‌తో పాటు పలువురు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మంగనూర్‌లో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్‌చార్జి విజయలక్ష్మి

బిజినేపల్లి: మహిళలు, అమ్మాయిలు తమపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులు, ఇతర నేరాలను అరికట్టడానికి ప్రతి ఒకరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా షీ టీం ఇన్‌చార్జి విజయలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం పోక్సో చట్టం ఇతరాత్ర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా షీ టీం ఇన్‌చార్జి విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రకాల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ఎప్పుడైన వేధింపులకు, లైంగిక దాడులకు గురైన 100కి లేదా 8712657676ను సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వరప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలను వేధిస్తే చర్యలు తప్పవు

అచ్చంపేట రూరల్: మహిళలు, బాలికలను వేధిస్తే చర్యలు తప్పవని షీటీం హెడ్ కానిస్టేబుల్ పద్మ హెచ్చరించారు. మండలంలోని ఐనోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేధించినా, అసభ్యంగా మాట్లాడినా, షీటీంకు ఫిర్యాదు చేయాలన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. షీటీం కానిస్టేబుల్ వెంకటేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠ మేమే చేస్తాం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు వెల్లడించారు. గురువారం ఆమె మున్సిపల్ కౌన్సిలర్లు రోహాంపాష, నయూంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గుడి నిర్వహణ బాధ్యతలను మున్సిపాలిటీయే చూస్తుందని, త్వరలో చేపట్టబోయే విగ్రహ ప్రతిష్ఠ కూడా మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే జరుగుతుందని ఆమె తెలిపారు. ఈనెల 30, 31, ఫిబ్రవరి 1 తేదీలతో ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠకు మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతారన్నారు. ఫిబ్రవరి 2న కోటమైసమ్మ బోనాలు, 3వ తేదీన పోషమ్మ బోనాలు, 4వతేదీ నుంచి ఈదమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 11న ఈదమ్మ సిడే ఉత్సవం ఉంటుందని వారు తెలిపారు. సమావేశంలో మేకల రాముడుయాదవ్, బరిగెల సత్యనారాయణ యాదవ్ తదితరులున్నారు.

24 నుంచి ఆలిండియా క్రికెట్ టోర్నీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్–ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 24నుంచి సీవీకే ఆలిండియా స్థాయి టీ–20 క్రికెట్ టోర్నీని నిర్వహించనున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం స్టేడియంలోని పిచ్‌ను పరిశీలించారు. క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. టోర్నీ ప్రారంభోత్స వానికి భారత మాజీ క్రికెటర్ అజహరుద్దీన్, చెన్నూ రు ఎమ్మెల్యే గడ్డం వివేక్ రానున్నారని, ఈమేరకు ఫోన్ ద్వారా సమాచారం అందించామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అన్ని హంగులతో క్రికెట్ టోర్నీ ని నిర్వహిస్తామన్నారు. ఎంతో ప్రతిభ కల్గిన క్రికెట్ జట్లు పాల్గొననున్నాయని, పోటాపోటీగా జట్లు త లపడనున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, సీవీకే ఆల్ ఇండి యా టీ–20 అధ్యక్షుడు కపిలవాయి చంద్రమోహన్, కార్యదర్శి రఘురాం, క్రీడాకారులు ఉన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్



పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ ఏ.రమేష్‌కుమార్

కందనూలు: జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గురువారం సాయంత్రం పీఆర్టీయూ తెలంగాణ నాగర్‌కర్నూల్ జిల్లా 2025 క్యాలెండర్‌ను డీఈఓ రమేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేయాలని, కింది స్థాయి విద్యార్థులను అత్యున్నతస్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా ఉపాధ్యాయులు దిశానిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు నందకిషోర్, మహిళా ప్రధాన కార్యదర్శి సునీత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి

తాడూరు: విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీకృష్ణ, సత్యం పాల్గొన్నారు.

కిటకిటలాడుతున్న టీజీ బ్యాంకు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు వినియోగదారులతో కిటకిటలాడుతోంది. గతేడాది డిసెంబరు 28 నుంచి ఏపీజీవీబీని తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చారు. అప్పటి నుంచి ఖాతాదారులకు బ్యాంకు సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినిత్యం వందలాది మంది ఖాతాదారులు బ్యాంకుకు వచ్చి ఫోన్ పే, గూగుల్ పేలు పునరుద్ధరించుకుంటున్నారు. వందలాది మంది రావడంతో బ్యాంకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఒకేరోజు వేలాదిగా తరలి రాకుండా, రోజు కొంతమంది చొప్పున వచ్చి ఖాతాలను పునరుద్ధరించుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో సంక్రాంతి వేడుకలు



ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న లెక్చరర్లు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో స్త్రీల సాధికారత విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలతో పాటుగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అందించారు. కార్యక్రమంలో స్త్రీల సాధికారత విభాగం కో–ఆర్డినేటర్ శ్రీమతి భాయి, అకాడమీ కో–ఆర్డినేటర్ రాజు, లెక్చరర్లు శ్రీనివాసులు, జగదీశ్వర్ రెడ్డి, శ్యాంసుందర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

డీఏవీ ఆంగ్ల పాఠశాలలో..

దోమలపెంట: జెన్‌కో ఆధ్వర్యంలో ఈగలపెంటలో నిర్వహిస్తున్న డీఏవీ ఆంగ్ల పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భూగర్భ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ(ఓఅండ్ఎం)ఆదినారాయణ, ఎస్ఈ(సివిల్) రవీంద్రకుమార్, ఈఈ(సివిల్)రమేష్ దంపతులు ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు భోగి పండ్లను తలపై పోసి ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి



కల్వకుర్తి రూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి అయ్యింది. ప్రజాపాలనలో పదివేల 79 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గురువారం నాటికి వందశాతం సర్వే పూర్తి చేశారు మార్చాలా గ్రామంలో 15 ఇళ్ల దరఖాస్తుల నమోదుతో సర్వే పూర్తి అయ్యింది. ఎంపీడీఓ వెంకటరాములు మాట్లాడుతూ వచ్చిన ప్రతి దరఖాస్తును సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు.

వర్గీకరణ సాధించే దిశగా మహా ప్రదర్శన



లింగాల: ఎస్సీ వర్గీకరణ సాధించే దిశగా గ్రామ గ్రామానా ఎస్సీలను సమాయత్తం చేస్తున్నట్లు డప్పు కళాకారుల మండల గౌరవాధ్యక్షులు బంగారయ్య అన్నారు. గురువారం మండలంలోని మానాజీపేట, వల్లభాపూర్, రాంపూర్ గ్రామాలకు సంబంధించి డప్పు కళాకారుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహా ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ నిరంతర పోరాటం

చారకొండ: ఉపాధ్యాయ సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నయ్య, మండల అధ్యక్షులు మహిపాల్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో గురువారం టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగమయ్య, నారాయణ, అంజయ్య, యాదగిరి, రాంబిక్షయ్య, మాధవి, కృష్ణయ్య, రవీందర్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, రాజేందర్, ఉమా రాణి, గీత, లలిత పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి కోలాటం మాస్టర్ గద్దె అంజి

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లికి చెందిన కోలాటం మాస్టర్ గద్దె అంజి తెలుగు వెలుగు నంది జాతీయ పురష్కారానికి ఎంపికయ్యాడు. కోలాట కళారంగంలో విశేష కృషి చేయడంతో నంది జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితివేదిక ఫౌండర్ ఆఫ్ జాతీయ చైర్మన్ బ్రహ్మశ్రీ పోలోజు రాజ్‌కుమార్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రోగ్రాం సమన్వయకర్త శ్రీమతి వేములవాడ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. 11న శనివారం హైదరాబాద్ త్యాగరాయ గాన సభ కళా వెంకట దీక్షలు కళావేదికలో పురష్కారం ప్రదానోత్సవం ఉంటుందని వారు తెలిపారు.

జాతీయ సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థిని

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని విజ్ఞశ్రీ జాతీయ స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్లు తెలిపారు. జడ్చర్లలో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజ్ఞశ్రీ ని పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

డ్రమ్ సీడర్ పద్ధతి ఉపయోగించాలి



బిజినేపల్లి: వరి సాగులో నారుమడి చల్లుకోవడం, నారు పీకడం, నారు పర్చడం, నాటు వేయ్యడం వంటి పద్ధతులను అధిగమించడానికి డ్రమ్ సీడర్ పద్ధతిని ఉపయోగించాలని, డ్రమ్ సీడర్‌తో వరి విత్తుకోవడం వల్ల కూలీల కొరతతో పాటు, ఖర్చును కూడా అధిగమించవచ్చని బిజినేపల్లి మండల వ్యవసాయాధికారి నీతి అన్నారు. మండలంలోని మమ్మాయిపల్లిలో వరిలో వెదజల్లె పద్ధతి, డ్రమ్‌సీడర్‌తో విత్తుకునే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు 200 ఎకరాల్లో ఈ పద్ధతిలో సాగు చేస్తున్నట్లు ఏఓ నీతి తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఓ ఫరీద్, మమ్మాయిపల్లి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులలో సామర్థ్యాలను పెంచాలి



లింగాల: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం వచ్చే విధంగా వారిలో సామర్థ్యాలను పెంచాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. చెన్నంపల్లి, పద్మన్నపల్లి పాఠశాలలను గురువారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం ఇవ్వాలని, ప్రతి విద్యార్థికి అపార్ ఐడీని జనరేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఎంపికైన తల్పునూర్ విద్యార్థి



కందనూలు: మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు రో జులుగా జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మానిక్ అవార్డ్స్ పోటీలో నాగర్‌కర్నూల్ జిల్లా తల్పునూర్‌కు చెందిన సంజయ్‌కృష్ణ జాతీయ స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాడు. దివ్యాంగుల సౌలభ్యం కోసం తయారు చేసిన హ్యాండి క్రచేస్/చేతికర్రలు సాధారణంగా వారు వాడే చేతి కర్రలు అల్యూమినియంతో వాడతారు. వాళ్లు రోడ్డు మార్గంలో రాత్రి వేళ వెళ్తున్నప్పుడు వారి ఇబ్బందిని గమనించిన సంజయ్‌కృష్ణ వారి కోసం ప్రత్యేకమైన చేతి కర్రలను రూపొందించాడు. చేతికర్రలకు 9వోల్ట్ బ్యాటరీతో లైట్స్ పెట్టడం వల్ల రాత్రి వేళలో నడిచేటప్పుడు, రోడ్డు మార్గం దాటేటప్పుడు వీటి లైట్ ద్వారా వాహనదారులు సులభంగా గుర్తించడం వల్ల రోడ్డు ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడటం జరుగుతుంది. చేతి కర్రలకు బెల్ అమర్చడం ద్వారా వారు రద్దీ ఉన్న ప్రాంతాల్లో బెల్ మోగించి సులభంగా నడువవచ్చు. ఈ విద్యార్థిని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అభినందించారు.

డిప్యూటీ సీఎంకు ఘనస్వాగతం



సాక్షి, నెట్‌వర్క్: వనపర్తి జిల్లా పర్యటనకు వెళ్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవితో కలిసి పూలమాలలు వేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

- వెల్దండ మండల కేంద్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు ర విని కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తా మీదుగా తూడుకుర్తి నుంచి డిప్యూటీ సీఎం వెళ్లాల్సి ఉంది.

సమస్యల పరిష్కారానికి కృషి

కొల్లాపూర్: మున్సిపాలిటీలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య వెల్లడించారు. గురువారం పట్టణంలోని 10 వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు ఆమె కౌన్సిలర్ రహీంపాషతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగి మన్నెంయాదవ్ తదితరులున్నారు.

రైతుల పక్షాన పోరాడుతాం



కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతు భరోసా నిధులు ఎకరాకు రూ.15 వేలు చెల్లించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కొల్లాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, పోతుల వెంకటేశ్వర్లు, విజయరామారావు, సాంబశివుడు, రాంచందర్ యాదవ్, కాటం జంబులయ్య, యాదన్నగౌడ్, కట్టా శ్రీనివాసులు, సురేందర్‌గౌడ్, తదితరులున్నారు.

కొత్త్రలో ఘనంగా గణిత మేళా

వెల్దండ: మండలంలోని కొట్ర ఉన్నత పాఠశాలలో గురువారం గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత మేళా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండ, చారకొండ, వంగూర్ మండలాలకు చెందిన ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రవీందర్‌నాయక్, సరిత, ఉపాధ్యాయులు జంగయ్య, కూన శ్రీనివాసులు, రవికిరణ్, చెన్నకేశవులు, జాంగీర్, థావుర్యా, రాజేందర్ రెడ్డి, లక్ష్మణ్, రామారావు, విజయ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సోని ఉన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

కొల్లాపూర్: రైతుభరోసా నిధులు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని సీపీఎం నాయకులు గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. రైతాంగం పక్షాన సీపీఎం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ఉన్నారు.

రైతు భరోసాను రూ.15వేలు జమ చేయాలి



తాడూరు: రైతు భరోసా వానకాలం పంటతో కలిపి రూ.15వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు.

– తెలకపల్లి నెల్లిమా చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠకు సహకరించండి

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణం సమీపంలోని ఈదమ్మ గుడిలో దేవతామూర్తి విగ్రహ ప్రతిష్ఠకు అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, కులసంఘాల ప్రజలు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన గుడిని సందర్శించారు. ఈదమ్మ దేవతకు పూజలు చేశారు. అనంతరం ఆయన రైతు సంఘాల నాయకులతో సమావేశం అయ్యారు. ఈనెల 29, 30, 31 తేదీలలో ఈదమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠకు ముహూర్తం నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమాలను రైతు సంఘాలే పర్యవేక్షించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

జిప్సమ్ వాడితే దిగుబడి

లింగాల: ప్రస్తుతం యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంటకు జిప్సమ్ వాడకం ఎంతో అవసరమని ఏఈఓ భరత్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని రాయవరం శివారులో సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం ఏఈఓ పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

తిమ్మాజిపేట: ఏబీవీపీ మండలశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు గురువారం క్రీడాపోటీలు నిర్వహించారు. స్వామివేకానంద 162వ జయంతి సందర్భంగా తిమ్మాజిపేటలో మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, రంగోళి, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు స్వామి వివేకానంద కమిటీ అధ్యక్షులు దాచేపల్లి వేణుగోపాల్ తెలిపారు. ఎంఈఓ సత్యనారాయణశెట్టి క్రీడలను ప్రారంభించారు.

సమగ్ర వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

బిజినేపల్లి: రైతులు వ్యవసాయంలో సమగ్ర వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, సమగ్ర వ్యవసాయంతోనే రైతులకు మంచి లాభాలు ఉంటాయని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పాలెం కేవీకేనందు రైతులకు సమగ్ర వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కల్పించారు.